
సాక్షి
తూర్పుగోదావరి

శనివారం । 29 । జులై । 2023

వెండి చీరలో దర్శనం



బోట్‌క్లబ్(కాకినాడ): అధిక శ్రావణమాసం సందర్భంగా స్థానిక మెయిన్‌రోడ్డులోని సీతారామస్వామి ఆలయంలో గోదాదేవి అమ్మవారు శుక్రవారం వెండి చీరలో భక్తులకు దర్శనమిచ్చారు.



డెల్టాలకు నీరు విడుదల

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి శుక్రవారం తూర్పు డెల్టాకు 2,000, మధ్య డెల్టాకు 1,000, పశ్చిమ డెల్టాకు 1,000 క్యూసెక్కులు వదిలారు.

రండి బాబూ రండి..



ఇంజినీరింగ్ కోర్సులలో ప్రవేశాలకు షెడ్యూల్ విడుదలైంది. ఏపీ ఈఏపీ సెట్‌లో ఉత్తీర్ణులైన అభ్యర్థులు వెబ్ కౌన్సెలింగ్‌కు సిద్ధమవుతున్నారు. ప్రస్తుతానికి రిజిస్ట్రేషన్, సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ప్రక్రియ సాగుతోంది. వచ్చే నెల 3వ తేదీ నుంచి వెబ్ ఆప్షన్లకు షెడ్యూల్ ఇచ్చారు. -IIలో▸

న్యూస్‌రీల్

టెండర్ల ఆహ్వానం

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): జిల్లాలోని సాంఘిక సంక్షేమ వసతి గృహాలకు 2023 - 24 సంవత్సరానికి కందిపప్పు, మినపప్పు, నూనె మొదలగు వంట సరకులు, గుడ్లు, చికెన్ సరఫరా చేయడానికి టెండర్లు ఆహ్వానిస్తున్నారు. ఈ మేరకు జేసీ తేజ్ భరత్ తరపున జిల్లా పర్చేజ్ కమిటీ, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ శుక్రవారం ప్రకటన విడుదల చేసింది. ఆసక్తి కలవారు శనివారం నుంచి ఆగస్టు 7వ తేదీ వరకూ రాజమహేంద్రవరం సబ్ కలెక్టర్ కార్యాలయంలో టెండర్లను రూ.1000 డీడీ తీసీ సమర్పించాలి. మరిన్ని వివరాలను 97046 28999 నంబర్‌ను సంప్రదించవచ్చు.

రేషన్ కార్డుదారులకు నాణ్యమైన బియ్యం



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ తేజ్ భరత్

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): జిల్లాలోని 5,64,555 రేషన్ కార్డుల ద్వారా 15.79 లక్షల మందికి 84,225.90 క్వింటాళ్ల నాణ్యమైన సార్టెక్స్ బియ్యాన్ని ఉచితంగా, నూనె, పంచదార, ఇతర సరకులను ఇండెంట్ ప్రకారం ప్రజా పంపిణీ వ్యవస్థ కింద అందజేస్తున్నామని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎన్.తేజ్ భరత్ తెలిపారు. కలెక్టరేట్‌లో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో డీఎం మార్కెటింగ్ ఎ.కుమార్, ఇన్‌చార్జి డీఎస్ఓ కె.విజయభాస్కర్‌తో కలిసి ఆయన మాట్లాడారు. జిల్లాలోని 870 రేషన్ దుకాణాల నుంచి 364 ఎండీయూ వాహనాల ద్వారా నిత్యావసరాలను పంపిణీ చేస్తున్నామన్నారు. ప్రతి నెలా 94.5 శాతం మంది కార్డుదారులకు సరకులు అందజేస్తున్నామని తెలిపారు. పీడీఎస్ బియ్యం పంపిణీ కోసం రాష్ట్ర ప్రభుత్వం కేజీకి రూ.40 చొప్పున జిల్లాకు సంబంధించి రూ.32 కోట్లు వెచ్చిస్తోందన్నారు. ఇటీవల రాజానగరంలో రేషన్ బియ్యంతో పలు వంటకాలు తయారు చేసి ప్రజలకు అవగాహన కల్పించామన్నారు. కొందరు కార్డుదారులు ఆ బియ్యాన్ని వ్యాపారులకు విక్రయిస్తున్నారని తెలిసిందన్నారు. రేషన్ బియ్యాన్ని అక్రమంగా రవాణా చేసే వారిపై క్రిమినల్ మరియు 6ఏ కేసులు నమోదు చేస్తున్నామన్నారు. కొవ్వూరు డివిజన్‌లో ఆగస్టు నుంచి సెప్టెంబర్ వరకూ జిల్లాలోని కార్డుదారులకు ఎండీయూల ద్వారా ఫోర్టిఫైడ్ బియ్యం పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు.

అప్రెంటిస్‌కు దరఖాస్తుల ఆహ్వానం

రాజమహేంద్రవరం సిటీ: ఆర్టీసీలో డీజిల్ మెకానిక్, మోటారు మెకానిక్, ఎలక్ట్రీషియన్, వెల్డర్ విభాగాల్లో అప్రెంటిస్ కోసం జిల్లాలో ఐటీఐ ఉత్తీర్ణులైన వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు డీపీటీఓ షర్మిల అశోక తెలిపారు. ఆసక్తి కలవారు ఆగస్టు 15వ తేదీ లోపు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ. ఏపీపీఆర్ఈఎన్‌టీఐసీఈఎస్‌హెచ్ఐపీఐఎన్‌డీఐఏ.జీఓవీ.ఐఎన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. అనంతరం ఆగస్టు 18వ తేదీన విజయనగరంలోని జోనల్ ట్రైనింగ్ కాలేజీ వద్దకు హాజరు కావాలన్నారు.

31న వికాసలో జాబ్ మేళా

కాకినాడ సిటీ: వికాస కార్యాలయంలో ఈనెల 31న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ కె.లచ్చారావు శుక్రవారం తెలిపారు. ఈ ఉద్యోగాలకు ఎస్ఎస్‌సీ, ఇంటర్, ఐటిఐ,డిప్లొమో, డిగ్రీ, బిటెక్, ఉత్తీర్ణులైన 35 సంవత్సరాల లోపు అభ్యర్థులు అర్హులన్నారు.



కొవ్వూరు : వేగేశ్వరపురం లంక భూముల్లో వరద ముంపులో బెండ, ఇతర కూరగాయల పంటలు



మామిడికుదురు: అప్పనపల్లి కాజ్‌వే మీదుగా ట్రాక్టర్‌పై రాకపోకలు



ధవళేశ్వరం : ధవళేశ్వరం బ్యారేజీ వద్ద మిగులు జలాల విడుదలను పరిశీలిస్తున్న ఎంపీ భరత్‌రామ్

పోటెత్తిన వరద

- బ్యారేజి వద్ద భారీగా వరద ప్రవాహం
- కొనసాగుతున్న రెండో ప్రమాద హెచ్చరిక
- సహాయక చర్యలపై ప్రభుత్వం అప్రమత్తం
- తక్షణ సాయంగా రూ.కోటి విడుదల
- సిద్ధంగా ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలు



కోటిలింగాల ఘాట్‌లోని వరద నీరు ఉధృతి

సాక్షి, రాజమహేంద్రవరం: ఎగువ ప్రాంతాల్లో భారీ వర్షాలు.. ప్రాజెక్టుల్లో నీటికి దిగువకు విడుదల చేస్తుండటంతో గోదావరి వరద పోటెత్తుతోంది. వరద నీరు ఉధృతంగా ప్రహిస్తోంది. భద్రాచలం వద్ద శుక్రవారం ఉదయం కాస్త నెమ్మదించిన నీటి మట్టం సాయంత్రానికి పెరిగింది. ఈ ప్రభావంతో ధవళేశ్వరం కాటన్ బ్యారేజ్ వద్ద వరద ఉధృతి పెరిగింది. మధ్యాహ్నం 3 గంటలకు. 14.10 అడుగులుగా ఉన్న నీటి మట్టం సాయంత్రానికి 14.10 అడుగుల వద్ద నిలకడగా సాగుతోంది.

అప్రమత్తం

వరద ప్రవాహంపై ఎలాంటి పరిస్థితైనా ఎదుర్కొనేందుకు అధికార యంత్రాంగం సిద్ధమైంది. ప్రభుత్వం, విపత్తుల శాఖ ఇప్పటికే ఆ దిశగా జిల్లా అధికారులకు సూచనలు ఇచ్చింది. లోతట్టు ప్రాంతాలు ముంపునకు గురయ్యే అవకాశాలున్న నేపథ్యంలో ప్రజలను అప్రమత్తం చేశారు. రెవెన్యూ, పోలీసులు, ఇరిగేషన్, నియోజకవర్గ, మండల ప్రత్యేక అధికారులను రంగంలోకి దింపారు. మత్స్య, పురపాలక, అగ్నిమాపక, పంచాయతీ అధికారులు వరద పరిస్థితులను ఎప్పటికప్పుడు అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారు. ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలు రంగంలోకి దిగాయి. గోదావరి పరివాహక ప్రాంతాలు, లంక ప్రాంతాల్లోని ప్రజలకు అప్రమత్తం చేశారు. పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఆహార పదార్థాలు, మందులు, బోట్లు సిద్ధంగా ఉంచారు.

లంక గ్రామాల్లో పునరావాస కేంద్రాలు

బ్రహ్మపురి పీఎస్ ఎలిమెంటరీ స్కూల్

మనకపల్లి జిల్లా పరిషత్ స్కూల్

వానపల్లి, ముద్దూరులంక వాడపల్లి జెడ్పీహెచ్ఎస్ స్కూల్

ముంపులోనే లంకలు

సీతానగరం మండలంలో బురద కాలువలోకి వరద నీరు చేరడంతో మిర్తిపాడు, ఉండేశ్వరపురం, కూనవరం, రఘుదేవపురం, రాపాక, చిన్నకుండేపూడి, వంగలపూడి గ్రామాలు, కోరుకొండ మండలంలో గుమ్ములూరు, బుచ్చంపేట, మునగాల, శ్రీరంగపట్నం, బూరుపూడి గ్రామాల్లో సుమారు 11 వేల ఎకరాల్లో నీరు చేరింది. ప్రస్తుతానికి పంటలకు ఎలాంటి ఇబ్బంది లేకపోయినా.. ప్రవాహం ఇలాగే కొనసాగితే నష్టం వాటిల్లే ప్రమాదం ఉంది. పెరవలి మండలంలో పైలంకలు కానూరు, అగ్రహారం, ఉసులుమర్రు, కాకరపర్రు, కందవల్లి, మల్లేశ్వరం గ్రామాలను వరద నీరు చుట్టుముట్టింది. అరటి తోటలు మునిగిపోయాయి. 1000 ఎకరాల్లో పంటలు నీట మునిగాయి. దిగువ లంకలో మరో 100 ఎకరాల్లో పంటలు నీట మునిగాయి.

ధవళేశ్వరం వద్ద నీటి మట్టం ఇలా..

సమయం	నీటి మట్టం (అడుగుల్లో)	నీటి విడుదల (క్యూసెక్కుల్లో)
మధ్యాహ్నం 3 గంటలు	14.10	13,29,133
4గంటలు	14.00	13,14,870
సాయంత్రం 5గంటలు	14.00	13,14,870
సాయంత్రం 6గంటలు	13.90	13,00,652
రాత్రి 11 గంటలు	13.90	13,00,652

తక్షణ సాయంగా రూ.కోటి

వరద సహాయక చర్యలు, పునరావాస కేంద్రాల్లో సేవలపై ప్రభుత్వం ముందస్తుగా స్పందించింది. ప్రస్తుత వరద పరిస్థితులకు ఎలాంటి నష్టం వాటిల్లకపోయినా మానవతా దృక్పథంతో వ్యవహరించింది. తక్షణం సాయంగా కు రూ.కోటి నిధులు విడుదల చేసింది. పునరావాస కేంద్రాల్లో నిర్వాసితులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని ఆదేశాలు జారీ చేసింది.

అప్రమత్తంగా ఉండాలి

- బాధితులకు అన్ని వసతులూ కల్పించాలి
- కలెక్టర్‌తో ముఖ్యమంత్రి జగన్



వీసీలో పాల్గొన్న కలెక్టర్ మాధవీలత

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): గోదావరి వరద నేపథ్యంలో పూర్తి అప్రమత్తంగా వ్యవహరిస్తూ, తగిన జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశించారు. ఈ మేరకు శుక్రవారం తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ముఖ్యమంత్రి జగన్ మాట్లాడుతూ లోతట్టు ప్రాంత కుటుంబాలకు 25 కిలోల బియ్యం, మంచినూనె, ఉల్లిపాయలు, నిత్యావసరాలు అందజేయాలన్నారు. జిల్లా, డివిజన్, మండల, సచివాలయం పరిధిలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాలన్నారు. పునరావాస కేంద్రాల వద్ద తాగునీరు, విద్యుత్ సౌకర్యం కల్పించాలని, వైద్య శిబిరాలు నిర్వహించాలని ఆదేశించారు. వరద ఉధృతి తగ్గిన తర్వాత నష్టంపై ఎన్యుమరేషన్ ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించాలన్నారు.

వరదపై ఎప్పటికప్పుడు సమీక్ష

వరద పరిస్థితిపై కలెక్టర్ మాధవీలత మాట్లాడుతూ ధవళేశ్వరంలోని కాటన్ బ్యారేజీ వద్ద రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేసిన నేపథ్యంలో లోతట్టు ప్రాంతాల ప్రజలను ముందుగానే అప్రమత్తం చేశామన్నారు. అధికారులందరూ వరద పరిస్థితిపై అప్రమత్తంగా ఉన్నారని, ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారని తెలిపారు. ముఖ్యంగా లంక గ్రామాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. జిల్లా మరియు డివిజినల్, మండల స్థాయిలో కంట్రోల్ రూమ్‌లు 24/7 ప్రజలకు అందుబాటులో ఉన్నాయన్నారు. గోదావరి గట్లు బలహీనంగా ఉన్నచోట్ల ముందస్తుగా ఇసుక బస్తాలు, ఇతర రక్షణ ఏర్పాట్లు చేశామన్నారు. పరిస్థితికి అనుగుణంగా పునరావాస కేంద్రాలు, వైద్య శిబిరాలను సిద్ధం చేసినట్టు తెలిపారు. జిల్లాలో రెండు లంక గ్రామాలకు సంబంధించి 12 మంది గర్భిణులను, ఐదుగురు బాలింతలను ఆరోగ్య కేంద్రాలకు తరలించామన్నారు. పునరావాస కేంద్రానికి చేరుకున్న కుటుంబానికి రూ.2 వేలు, ఒక్కరు ఉంటే రూ.వెయ్యి అందజేస్తున్నామన్నారు.

పర్యావరణ రక్షణ సమష్టి బాధ్యత

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): పర్యావరణ పరిరక్షణ సమష్టి బాధ్యత అని కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత అన్నారు. కలెక్టరేట్ ఆవరణలో శుక్రవారం మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రీన్ ఎర్త్, గ్రీన్ ఆంధ్రప్రదేశ్ నినాదంతో ఐఏఎస్ ఆఫీసర్స్ వైఫ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లాలో 25 వేల మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారన్నారు. మొక్కలు నాటడంతో పాటు వాటిని సంరక్షించాలన్నారు. పర్యావరణ పరిరక్షణ ప్రాముఖ్యతపై అవగాహన కోసం ఏటా జూలై 28న ప్రపంచ ప్రకృతి పరిరక్షణ దినోత్సవం జరుపుకొంటున్నామన్నారు. వాతావరణ మార్పులు – సవాళ్లు, సహజ వనరుల పరిరక్షణ – ఆవశ్యకతపై ప్రజలకు అవగాహన కల్పించడానికి ఇది ముఖ్యమైన సందర్భమన్నారు. ఐఏఎస్ అధికారుల భార్యలు, మహిళా అధికారులు, మహిళా వలంటీర్లు ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి జాయింట్ కలెక్టర్ భార్య ఎస్.శ్వేత, కార్పొరేషన్ కమిషనర్ భార్య కె.సౌమ్య హాజరయ్యారు. జేసీ ఎన్.తేజ్ భరత్, కార్పొరేషన కమిషనర్ కె.దినేష్ కుమార్, సహాయ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి, డ్వామా పీడీ జీఎస్ రామ్‌గోపాల్, మహిళా అధికారులు ఎస్.సుభాషిణి, కేఎస్ జ్యోతి, కె.విజయ కుమారి, డాక్టర్ ఎస్.వసుంధర, వి.శాంతమణి, పి.వీణాదేవి, టిడ్కో డీఈజీ నాగేశ్వరి పాల్గొన్నారు.



మొక్కను నాటి నీరు పోస్తున్న కలెక్టర్ మాధవీలత

వైఎస్సార్ సీపీ గెలుపే లక్ష్యంగా అడుగులు



పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ మార్గాని భరత్‌రామ్. చిత్రంలో సిటీ కోఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్ తదితరులు



డాక్టర్ గూడూరి శ్రీనివాస్‌ను అభినందిస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్యే జక్కంపూడి రాజా.చిత్రంలో రుడా చైర్మన్ షర్మిలారెడ్డి తదితరులు

- పార్టీ శ్రేణులకు ఎంపీ భరత్‌రామ్ పిలుపు
- రాజమహేంద్రవరం సిటీ కార్యాలయం ప్రారంభం
- పాల్గొన్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు రాజా

రాజమహేంద్రవరం సిటీ: రాజమహేంద్రవరం అర్బన్, రూరల్ అసెంబ్లీ నియోజకవర్గాల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల విజయమే లక్ష్యంగా పార్టీ శ్రేణులు పనిచేయాలని ఎంపీ మార్గాని భరత్ రామ్ పిలుపునిచ్చారు. నగరంలోని తిలక్ రోడ్డులో సిటీ వైఎస్సార్ సీపీ కార్యాలయాన్ని ఎంపీ భరత్‌రామ్,సిటీ కోఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్ శుక్రవారం ప్రారంభించారు. పార్టీ శ్రేణులను ఉద్దేశించి ఎంపీ భరత్ మాట్లాడారు. సీఎం జగన్‌మోహన్ రెడ్డి అనేక రకాలుగా సర్వేలు నిర్వహించి డాక్టర్ గూడూరి శ్రీనివాస్‌ను సిటీ నియోజకవర్గ సమన్వయ కర్తగా ఎంపిక చేశారన్నారు. సేవాతత్పరుడు, స్నేహశీలి శ్రీనివాస్ నగర వాసులకే కాకుండా వైద్యుడిగా ఉభయ గోదావరి జిల్లాలకూ సుపరిచితులన్నారు. రాజమహేంద్రవరం అభివృద్ధి విషయంలో సీఎం జగన్ ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నారన్నారు. నిధులు కూడా అలాగే మంజూరు చేశారన్నారు. డాక్టర్ గూడూరి శ్రీనివాస్ మాట్లాడుతూ అర్బన్ పార్టీ కార్యాలయం పార్టీ శ్రేణులందరికీ ఇల్లు వంటిదన్నారు. పంతాలు పట్టింపులకు తావివ్వకుండా కలిసికట్టుగా పార్టీ విజయానికి కృషి చేద్దామన్నారు.

మరింత చేరువ

అర్బన్ కార్యాలయం ప్రారంభోత్సవంలో ముఖ్యఅతిథిగా వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు,ఎమ్మెల్యే జక్కంపూడి రాజా మాట్లాడుతూ వైద్యరంగంలో ప్రత్యేక స్థానం సంపాదించుకొని ప్రజలకు చేరువైన శ్రీనివాస్‌ను ముఖ్యమంత్రి ఎంతో నమ్మకంతో సిటీ కోఆర్డినేటర్‌గా నియమించారన్నారు. ఆయన ఆధ్వర్యంలో పార్టీ ప్రజలకు మరింత చేరువ అవుతుందన్నారు. సంక్షేమ పథకాలను ప్రజలోకి తీసుకువెళ్లి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఆయనకు సూచించారు. ఈ కార్యక్రమంలో రుడా చైర్ పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి, మాజీ కార్పొరేటర్లు, పార్టీ నాయకులు అభిమానులు పాల్గొన్నారు. కోఆర్డినేటర్ చాంబర్‌ను బీసీ జేఏసీ రాష్ట్ర చైర్మన్ మార్గాని నాగేశ్వరరావు, డాక్టర్ గూడూరి శ్రీనివాస్ సంయుక్తంగా ప్రారంభించారు. కార్యక్రమంలో నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి,మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు, కానుబోయిన సాగర్, పోలు విజయలక్ష్మి,గూడూరి రాధిక, బర్రే కొండబాబు, నక్కా నగేష్ మాజీ కార్పొరేటర్లు,పార్టీ నాయకులు, పెద్ద ఎత్తున కార్యకర్తలు, వైసీపీ అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

మెట్టలో జలకళ



నిండుకుండలా ఎర్నగూడెం గండిచెరువు

- గోదావరికి అటూ ఇటూ ఖరీఫ్ రైతు ఖుషీ
- నిండుకుండల్ని తలపిస్తున్న చెరువులు
- ఊపందుకున్న వ్యవసాయ పనులు
- ఖరీఫ్ సీజన్‌కు కలిసొచ్చిన వానలు

సాక్షిప్రతినిధి, కాకినాడ: మెట్ట ప్రాంతంలో జలకళ ఉట్టిపడుతోంది. చెరువులన్నీ నిండు కుండను తలపిస్తున్నాయి. నీరు లేక నిన్న మొన్నటి వరకు ఖరీఫ్ సాగు ప్రశ్నార్థకమైంది. తాజాగా నైరుతి ఆగమనానికి అల్పపీడనం తోడవ్వడంతో వరుణుడు కరుణించాడు. వరద గోదావరి వారం రోజులుగా పోటెత్తున్న పరిస్థితుల్లో వర్షాలు కూడా పడుతున్నాయి. ఈ వర్షాలు మెట్టకు మేలే చేశాయంటున్నారు రైతులు. ఫలితంగా ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో మెట్ట ప్రాంత మండలాలన్నీ జలసిరితో కనువిందు చేస్తున్నాయి. డెల్టా ప్రాంతమైన కోనసీమ జిల్లా మినహా కాకినాడ, తూర్పుగోదావరి జిల్లాల్లో వ్యవసాయ పనులు జోరందుకున్నాయి.

జోరందుకున్న నాట్లు

- తాజా వర్షాలకు తుని, ప్రత్తిపాడు నియోజకవర్గాల్లో ఇప్పటికే నారుపోసిన రైతులు నాట్లు వేస్తున్నారు. తాండవ, పంపా జలాశయాల్లోకి నీరు పుష్కలంగా చేరడంతో రైతులు దుక్కులు దున్నుతున్నారు.
- పంపాకు ఇప్పటికే నీరు విడుదల చేయడంతో నాట్లు జోరందుకున్నాయి. తాండవ పరిధిలో 51 వేల పైచిలుకు ఎకరాల్లో సాగుకు సన్నద్ధమవుతున్నారు.
- ప్రత్తిపాడు నియోజకవర్గం తిమ్మరాజు చెరువు, పెదబాపన్న చెరువు, పెదచెరువుల్లో జలకళ ప్రస్ఫుటమవుతోంది.
- చంద్రబాబు సాగర్, సుబ్బారెడ్డి సాగర్‌లకు నీరు చేరడంతో సుమారు 15వేల ఎకరాల్లో నాట్లు వేసేందుకు సిద్ధమయ్యారు.
- కిర్లంపూడి మండలంలోని చెరువుల కింద ఆయకట్టు రైతులు వరి సాగులో నిమగ్నమయ్యారు.
- ముసురుమిల్లి ప్రాజెక్టు, తాళ్లూరు లిఫ్ట్, ఏలేరు ద్వారా సుమారు 25వేల ఎకరాల్లో వ్యవసాయ పనులు ఊపందుకున్నాయి.
- పిఠాపురం బ్రాంచి కెనాల్, ఏలేరు కాలువల కింద సుమారు 35వేల ఎకరాల ఆయకట్టులో రైతులు ఖరీఫ్ సాగు పనుల్లో నిమగ్నమయ్యారు.

నీరు విడుదల చేయకుండానే..

ఎత్తిపోతల పథకాల నుంచి విడుదలయ్యే గోదావరి జలాల అవసరం లేకుండానే రాజానగరం నియోజకవర్గ పరిధిలో రికార్డు స్థాయిలో వరి నాట్లు పూర్తయ్యాయి. చాగల్నాడు ఎత్తిపోతల పథకం నుంచి గోదావరి జలాలు విడుదల చేయాల్సిన అవసరం రాలేదు. ఈ పథకం ద్వారా రాజానగరం, రంగంపేట, బిక్కవోలు, అనపర్తి, రాజమహేంద్రవరం రూరల్ మండలాలలోని 35 వేల ఎకరాలకు సాగు నీటిని అందించాలనేది లక్ష్యం. 20 వేల ఎకరాల సాగుకు డోకా లేకుండా ఉంది. రంగంపేట మండలంలోని చెరువుల్లో కూడా పుష్కలంగా నీరు చేరి రైతులకు భరోసానిచ్చాయి. కాకినాడ జిల్లాలోని మెట్ట ప్రాంత మండలాల్లో జిల్లా వ్యవసాయ శాఖ లక్ష ఎకరాల్లో ఖరీఫ్ సాగు లక్ష్యంగా పెట్టుకుంది. ఇంతవరకు 15వేల ఎకరాల్లో నాట్లు పూర్తయ్యాయి. ఎట్టి పరిస్థితుల్లోను ఆగస్టు 20 కల్లా నాట్లు పూర్తి చేసేందుకు సమాయత్తమయ్యారు.



నల్లజర్ల మండలం అనంతపల్లిలో వరినాట్లు

అవతల మెట్టలోనూ ఆనందమే

గోదావరికి అవతల మెట్ట ప్రాంతంలో నాలుగైదు రోజులుగా వ్యవసాయ పనులు ఊపందుకున్నాయి. గోపాలపురం, నిడదవోలు, కొవ్వూరు నియోజకవర్గాల్లోని మెట్ట ప్రాంతాల్లో చెరువులు, ఎత్తిపోతల పథకాలలో నీరు సమృద్ధిగా చేరింది. గోపాలపురం నియోజకవర్గంలో వ్యవసాయ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఈ ప్రాంత చెరువులు నీటితో ఉరకలెత్తుతున్నాయి. మునుపెన్నడూ లేని విధంగా ఈ సీజన్‌లో సుమారు 15వేల ఎకరాల్లో వరి నాట్లు వేస్తున్నారు. కొవ్వూరు కుమారదేవం, వేగేశ్వరపురం, పైడిమెట్ట, చాగల్లు, బ్రాహ్మణ గూడెం, తాడిపూడి లిఫ్ట్‌లతో పాటు చెరువుల కింద ఆయకట్టులో రైతులు ఖరీఫ్ సాగు పనుల్లో బిజీగా ఉన్నారు.

ధైర్యాన్నిచ్చిన వర్షాలు



వర్షాలు ఖరీఫ్‌కు ధైర్యాన్నిచ్చాయి. గతంలో తాండవ నీటి కోసం ఇబ్బందులు పడేవాళ్లం. ఇప్పుడు వర్షాలతో జలాశయం నిండుకుండలా ఉంది. అవసరాలకు అనుగుణంగా అధికారులు సాగునీటిని విడిచిపెడుతున్నారు. ఈ ఏడాది కూడా ఆగస్టు మొదటి వారంలోనే నీటిని విడుదల చేస్తామని ప్రకటించారు. వర్షాలతో సంబంధం లేకుండా ఖరీఫ్ ఒడ్డెక్కే పరిస్థితులున్నాయి.

– చిటికెల బాపన్నదొర, రైతు,కొత్తకొట్టాం, కోటనందూరు మండలం.

'ఖరీఫ్ సాగుకు సానుకూలం'



వర్షాలతో చెరువులలో పుష్కలంగా సాగునీరు వచ్చింది. తాజాగా వర్షాలు తొలకరి పంటకు బాగా కలిసి వచ్చాయి. నల్లా ఎర్రాచెరువులో పూర్తిగా నీరు చేరడంతో నాట్లకు సిద్ధమయ్యాం. నాట్లు ముందుగానే వేయడంతో పంట తొందరగా చేతికొస్తుందని సంతోషంగా ఉంది.

– కల్లెం కన్నయ్య, జగన్నాథపురం,నల్లజర్ల మండలం.

క్లుప్తంగా

భాస్కరరెడ్డి పదవీకాలం పొడిగింపు


ద్వారంపూడి భాస్కరరెడ్డి

కాకినాడ: ఆంధ్రప్రదేశ్ సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ అధ్యక్షుడు ద్వారంపూడి భాస్కర రెడ్డి పదవీ కాలాన్ని మరో ఏడాది పొడిగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆంధ్రప్రదేశ్ రైస్ మిల్లర్ల సంఘం అధ్యక్షుడిగా ఉన్న భాస్కర రెడ్డిని 2021 జూలై 30న రెండేళ్ల పదవీ కాలానికి రాష్ట్ర సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమించారు. ఆ మేరకు ఈ నెల 30వ తేదీతో పదవీ కాలం ముగియనుంది. తాజా ఉత్తర్వులతో మరో ఏడాది పాటు ఆయన ఆ పదవిలో కొనసాగనున్నారు. ఈ సందర్భంగా భాస్కరరెడ్డిని పలువురు నాయకులు, కార్యకర్తలు, అధికారులు అభినందించారు.

వామ్మో.. ఎంత పెద్ద పామో!



ఆత్రేయపురం: గోదావరి వరద ప్రవాహంతో పాటు కొండ కోనల నుంచి భారీ సర్పాలు కొట్టుకుని వస్తున్నాయి. ఈ క్రమంలోనే బొబ్బర్లంక వద్ద వరద గోదావరిలో చేపలు పట్టేందుకు ఓ మత్స్యకారుడు వేసిన వలలో భారీ కొండచిలువ చిక్కుకుంది. ఏదో ఒక పెద్ద చేప చిక్కి ఉంటుందని భావించిన మత్స్యకారుడు ఆ వలను బయటకు లాగడంతో అందులో కొండచిలువ కనిపించింది. చాలా పెద్ద పాము కావడంతో ఒకింత భయంతోనే స్థానికులు దీనిని చూసేందుకు ఎగబడ్డారు. చివరకు ఆ కొండచిలువను మత్స్యకారులు తిరిగి గోదావరిలోకే విడిచిపెట్టారు.

రండి బాబూ రండి..



- విద్యార్థులకు 'ప్రైవేటు' గాలం
- ఇంజినీరింగ్ కళాశాలల బేరసారాలు
- ఈఏపీ సెట్ కౌన్సెలింగ్‌కు ముందే హడావుడి
- సీట్లు దొరకవంటూ ప్రచారం
- ముందస్తుగా కొంత ముట్టజెప్పాలంటూ ఒత్తిళ్లు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): ఇంజినీరింగ్ కోర్సులలో ప్రవేశాలకు షెడ్యూల్ విడుదలైంది. ఏపీ ఈఏపీ సెట్‌లో ఉత్తీర్ణులైన అభ్యర్థులు వెబ్ కౌన్సెలింగ్‌కు సిద్ధమవుతున్నారు. ప్రస్తుతానికి రిజిస్ట్రేషన్, సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ప్రక్రియ సాగుతోంది. వచ్చే నెల 3వ తేదీ నుంచి వెబ్ ఆప్షన్లకు షెడ్యూల్ ఇచ్చారు. సరిగ్గా ఇదే సమయంలో ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలలు సీట్లు భర్తీ చేసుకునే పనిలో బిజీగా ఉన్నాయి. సమయం దగ్గర పడటంతో స్పీడ్ పెంచాయి. తమ కళాశాలల్లో చేరాలంటూ విద్యార్థులకు ఫోన్ల ద్వారా గాలం వేస్తున్నారు. కాస్త పేరున్న కళాశాలల్లో కంప్యూటర్ సైన్స్, ఐటీ, ఈసీఈ బ్రాంచీలలో సీట్లు చాలా వరకూ లేవని చెబుతున్నారు. దీంతో ఆయా కళాశాలల్లో డిమాండ్ ఉన్న బ్రాంచీలలో సీట్ల కోసం సిఫారసులు చేసుకునే పనిలో కొంతమంది విద్యార్థుల తల్లిదండ్రులు తలమునకలవుతున్నారు.

కోరుకున్న చోట సీటు కష్టమంటూ..

ఈఏపీ సెట్ ఫలితాల్లో వచ్చిన ర్యాంకు ఆధారంగా అడ్మిషన్లకు దరఖాస్తు చేసుకుందామని వేచి చూస్తే కోరుకున్న కళాశాలలో సీటు దొరక్కపోవచ్చంటూ అప్పుడే ప్రచారం మొదలు పెట్టేశారు. సీటు విషయమై ఒక అంచనాకు వస్తే బాగుంటుందని, ముందస్తుగా కొంత ముట్టజెప్పి సీటు రిజర్వ్ చేసుకోవాలని కొన్ని కళాశాలలు విద్యార్థుల తల్లిదండ్రులపై ఒత్తిడి తెస్తున్నాయి. మంచి కళాశాలలో సీట్లు దొరకవనే ప్రచారంతో ర్యాంకులతో సంబంధం తల్లిదండ్రులు తమ పిల్లలకు లేకుండా సీట్లు ఖరారు చేసుకుంటున్నారు. కన్వీనర్, మేనేజ్‌మెంట్, ఎన్ఆర్ఐ.. ఇలా పలు విధాలుగా సీట్లు ఖాయం చేసుకుంటున్నారు. ఎన్ఆర్ఐల భాగస్వామ్యంతో చదువుకునే విద్యార్థులకు సంబంధించిన 15 శాతం ఎన్ఆర్ఐ కోటా సీట్లను ఇప్పటికే ఆయా కళాశాలలు భర్తీ చేసుకున్నాయని సమాచారం.

ఈ బ్రాంచిలకు డిమాండ్

రెండేళ్ల నుంచి ఐటీకి అంతర్జాతీయంగా విపరీతమైన డిమాండ్ వచ్చింది. సాఫ్ట్‌వేర్ కొలువులకు కంపెనీలు భారీగా ఆఫర్లు ప్రకటిస్తున్నాయి. దీంతో సీఎస్ఈ, దానికి అనుబంధంగా ఉండే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సైబర్ సెక్యూరిటీ తదితర బ్రాంచీలకు ఎక్కడ లేని డిమాండూ ఏర్పడింది. దీనిని ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలలు బాగానే 'క్యాష్' చేసుకుంటున్నాయి. కాకినాడ జిల్లాలో బాగా పేరొందిన ఒక ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలలో సీఎస్ఈ సీటుకు రూ.10 లక్షల వరకూ కూడా డొనేషన్ ఇవ్వడానికి వెనుకాడటం లేదంటే ఎంత డిమాండ్ ఉందో అర్థం చేసుకోవచ్చు. ఒక మోస్తరు కళాశాల అయితే రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షల వరకూ ఇస్తామని, సీటు రిజర్వ్ చేయాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. కౌన్సెలింగ్ ప్రారంభమయ్యాక కోరుకున్న కళాశాలలో సీటు రాకపోతే బాధ పడి ప్రయోజనం ఉండదని, ముందుగానే యాజమాన్యాలతో మాట్లాడుకుని, ర్యాంకు వస్తే ఆ కోటాలో సీటు ఖరారు చేసుకోవచ్చని, లేకపోతే దానిని మేనేజ్‌మెంట్ లేదా ఎన్ఆర్ఐ కోటాకు మార్చుకొనే వీలు కల్పిస్తామని చెబుతూ యాజమాన్యాలు ఇప్పటి నుంచే సీట్లు భర్తీ చేసుకుంటున్నాయి.

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో..

ప్రభుత్వ ఇంజినీరింగ్ కళాశాలలు	2
సీట్లు	950
ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలలు	27
సీట్లు	14,770
ఏపీ ఈఏపీ సెట్ రాసిన వారు	13,744
ఉత్తీర్ణులైన వారు	12,465

- ఈ వివరాల ప్రకారం కౌన్సెలింగ్‌లో పాల్గొన్న ప్రతి విద్యార్థికీ ఏదో ఒక ఇంజినీరింగ్ కళాశాలలో అడ్మిషన్ లభిస్తుంది.

కన్వీనర్ కోటాకే ప్రభుత్వ సహాయం



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన జగనన్న విద్యాదీవెన, వసతి దీవెన వంటి పథకాలు కన్వీనర్ కోటాలో అడ్మిషన్ పొందిన విద్యార్థులకే వర్తిస్తాయి. బీటెక్‌లో అన్ని బ్రాంచీలు ముఖ్యమైనవే. విద్యార్థుల ఇష్టం మేరకు ఎంచుకుని కన్వీనర్ కోటాలో చేరవచ్చు. జేఎన్‌టీయూకే పరిధిలోని 160 కళాశాలల్లో దాదాపు 30 వేల సీట్లు కన్వీనర్ కోటాలో ఉన్నాయి. ఎంసెట్ ఉత్తీర్ణులైన ప్రతి విద్యార్థీ కౌన్సెలింగ్‌లో పాల్గొనాలి.

– డాక్టర్ సీహెచ్ సాయిబాబు, ఏపీ ఎంసెట్ పూర్వపు కన్వీనర్, డైరెక్టర్ ఆఫ్ అకడమిక్ ఆడిట్, జేఎన్‌టీయూకే

నేపాల్ టు రంగంపేట

- మతిస్థిమితం లేని వ్యక్తి రాక
- వివరాలు తెలుసుకుని బంధువులకు అప్పగించిన పోలీసులు



పోలీసులకు కృతజ్ఞతలు తెలుపుతున్న బాజ్‌పాయ్, గోపాల్ పాండే

రంగంపేట: మతిస్థిమితం లేని ఓ వ్యక్తిని వారి కుటుంబ సభ్యులకు అప్పగించారు రంగంపేట పోలీసులు. అనపర్తి సీఐ వి.శ్రీనివాస్ శుక్రవారం తెలిపిన వివరాల ప్రకారం.. నేపాల్‌కు చెందిన బిజయ్ బాజ్‌పాయ్ (28) ఉన్నత చదువులు చదివాడు. మతిస్థిమితం లేకపోవడంతో నేపాల్ నుంచి మన దేశంలోకి వచ్చి.. ఆంధ్రప్రదేశ్‌కు చేరుకున్నాడు. ఎక్కడెక్కడో తిరుగుతూ ఈ నెల 22వ తేదీ రాత్రి రంగంపేట మండలం కోటపాడు వచ్చాడు. గ్రామ శివారున ఏడీబీ రోడ్డు పక్కన ఉన్న అల్యూమినియం ఫ్యాక్టరీలోకి అక్రమంగా ప్రవేశించాడు. అతడిని గుర్తించిన ఫ్యాక్టరీ సిబ్బంది దొంగ అనుకొని కాళ్లు, చేతులు తాళ్లతో బంధించి గాయపరిచారు. అనంతరం రంగంపేట పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్సై టి.రామకృష్ణ ఆధ్వర్యాన పోలీసులు అతడిని అదుపులోకి తీసుకుని రంగంపేట పీహెచ్‌సీలో వైద్య సేవలు అందించారు. రెండు రోజుల పాటు కోలుకున్న అనంతరం అతడిని విచారించారు. అతడు ఇచ్చిన సమాచారం ప్రకారం అతడి ఫేస్‌బుక్ పేజీ ఓపెన్ చేయగా అందులో స్కూల్ ముందు తీయించుకున్న ఫొటో ఉంది. ఆ స్కూల్ బోర్డుపై కనిపించిన నంబరుకు పోలీసులు ఫోన్ చేసి, అక్కడి ఉపాధ్యాయుడికి వివరాలు తెలిపారు. దీంతో ఆ టీచర్ బాజ్‌పాయ్‌ను గుర్తు పట్టి, అతడి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. అప్పటికే తమ కుమారుడు కనిపించడం లేదంటూ బాజ్‌పాయ్ కుటుంబ సభ్యులు నేపాల్‌లోని బారా జిల్లా కలియా పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అతడు ఇక్కడ ఉన్నట్టు తెలియడంతో బాజ్‌పాయ్ బావ గోపాల్ పాండే తన బంధువులతో కలిసి రంగంపేట పోలీసు స్టేషన్‌కు చేరుకున్నాడు. తగిన ఆధారాలు చూపడంతో పాటు నేపాల్ పోలీసులు అందించిన సమాచారంతో బాజ్‌పాయ్‌ని అతడి బావ గోపాల్ పాండేకు స్థానిక పోలీసులు శుక్రవారం అప్పగించారు. పోలీసులకు బాజ్‌పాయ్ తల్లిదండ్రులు, బావ గోపాల్ పాండే కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ ముంగి రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

భక్తులకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు

- దేవదాయ కమిషనర్ ఆదేశం
- అన్నవరం దేవస్థానంలో పర్యటన
- అభివృద్ధి పనుల పరిశీలన
- అధికారులతో సమీక్ష


కమిషనర్‌కు మాస్టర్ ప్లాన్‌ను వివరిస్తున్న ఈఈ. చిత్రంలో చైర్మన్ ఐవీ రోహిత్, ఏసీ రమేష్‌బాబు

అన్నవరం: సత్యదేవుని భక్తులకు ఎటువంటి ఇబ్బందులూ కలగకుండా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర దేవదాయ, ధర్మదాయ శాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ ఆదేశించారు. చైర్మన్ ఐవీ రోహిత్‌తో కలిసి అన్నవరం దేవస్థానంలోని వివిధ అభివృద్ధి పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. ముఖ్యమైన పర్వదినాల్లో భారీగా వచ్చే భక్తులందరికీ సకాలంలో స్వామివారి వ్రతం, దర్శనం జరిగేలా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. సత్యదేవుని ప్రసాదం విభాగాన్ని పరిశీలించి, ప్రసాదం రుచిగా తయారు చేయాలని ఆదేశించారు. గోధుమ నూక ప్రసాదం రుచి చూశారు. రామాలయం పక్కన ఉన్న కమాండ్ కంట్రోల్ రూములో దేవస్థానం పాలనా వ్యవహారాలు, నిర్మాణ సంబంధ అంశాలపై సమీక్షించారు. దేవస్థానం మాస్టర్ ప్లాన్, తాజాగా చేపట్టిన అభివృద్ధి పనుల గురించి ఆయనకు ఈఈ ఎస్ఎస్ చంద్రశేఖర్ ఆజాద్ వివరించారు.

ఆగమం ప్రకారమే నిర్మాణాలు

కమిషనర్ సత్యనారాయణ మాట్లాడుతూ, దేవస్థానంలో ఏ నిర్మాణమైనా ఆగమ శాస్త్రానికి అనుగుణంగా చేపట్టాలని అన్నారు. దేవస్థానానికి త్వరలో 4 బస్సులు కొనుగోలు చేస్తున్నామని, వాటిని కొండ దిగువ నుంచి రత్నగిరికి నడుపుతామని ఈఓ తెలిపారు. న్యూ సీసీ సత్రంపై త్వరలో విద్యుద్దీపాలతో శంఖుచక్రనామాల ఏర్పాటుకు టెండర్లు ఖరారు చేశామని చెప్పారు. వివాదానికి తావు లేకుండా నామం ఏర్పాటు చేయాలని కమిషనర్ ఆదేశించారు. వెండి, చెక్క రథాల నిర్మాణానికి కూడా అనుమతి వచ్చిందని ఈఓ తెలిపారు. రూ.1.32 కోట్లతో సీఆర్ఓ కార్యాలయం నుంచి రెండో ఘాట్ రోడ్డు రెండో మలుపు వరకూ రోడ్డు నిర్మాణానికి టెండర్లు పిలిచే అంశాన్ని పరిశీలించి, వెంటనే అనుమతిస్తామని కమిషనర్ చెప్పారు. కేంద్ర ప్రభుత్వ ప్రసాద్ స్కీము కింద రూ.50 కోట్లు వచ్చే అవకాశం ఉందని, ఆ నిధులతో చేపట్టాల్సిన అన్నదానం భవనం, కొండ దిగువన డార్మెట్రీ, వ్రత మండపాలు తదితర నిర్మాణాలను దేవస్థానం నిధులతో చేపట్టవద్దని ఆదేశించారు. ప్రసాద్ నిధుల విడుదల కోసం కేంద్ర పర్యాటక శాఖ ఉన్నతాధికారులను త్వరలోనే సంప్రదించాలని ఆదేశించారు. తిరుమల మెట్ల మార్గంలో మాదిరిగా అన్నవరంలో మెట్ల దారిలో కూడా రూ.30 లక్షలతో షెల్టర్ ఏర్పాటు చేసేందుకు టెండర్లు పిలిచామని ఈఓ చెప్పారు.

రూఫ్ ప్యానల్స్‌తో సోలార్ విద్యుత్ ప్లాంట్

నేలపై కాకుండా వివిధ సత్రాల రూఫ్‌పై ప్యానల్స్ ఏర్పాటు చేసుకుని సోలార్ విద్యుత్ ప్లాంట్ నిర్వహించేందుకు సంబంధిత సంస్థలకు అవకాశం ఇస్తున్నామని కమిషనర్‌కు ఈఓ ఆజాద్ వివరించారు. అలాగే చెందుర్తి సమీపాన దేవస్థానానికి 159 ఎకరాల భూమి ఉందని, ఇందులో 50 ఎకరాల్లో సోలార్ విద్యుత్ ప్లాంట్ ఏర్పాటుకు ఎకరానికి రూ.30 వేల చొప్పున చెల్లించే పద్ధతిపై లీజుకు ఇస్తున్నామని వివరించారు. భూమి లీజుకు ఇచ్చేటప్పుడు యాజమాన్య హక్కులు పూర్తిగా దేవస్థానానికే ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని కమిషనర్ ఆదేశించారు. రత్నగిరిపై 33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణం వచ్చే నెల 15వ తేదీకి పూర్తవుతుందని ఆ శాఖ అధికారులు చెప్పారని ఈఓ తెలిపారు. కార్యక్రమంలో దేవదాయ శాఖ ఆర్‌జేసీ సురేష్ బాబు, డీసీ విజయరాజు, అన్నవరం దేవస్థానం ఏసీ రమేష్‌బాబు, ట్రస్టీలు పేరూరి బద్రి, కారుకోడి పూజ, కర్రి భామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆయుష్య హోమం చార్జీ తగ్గింపు



- ప్రదక్షిణ దర్శనం టికెట్ రూ.300కు పెంపు
- ప్రతి గురువారం నిజరూప దర్శనం
- అన్నవరం దేవస్థానం ట్రస్ట్‌బోర్డు తీర్మానాలు

అన్నవరం: సత్యదేవుని సన్నిధిలో ప్రతి నిత్యం నిర్వహిస్తున్న లక్ష్మీ ప్రయుక్త ఆయుష్య హోమం టికెట్‌ను రూ.2 వేల నుంచి రూ.వెయ్యికి తగ్గించాలని అన్నవరం దేవస్థానం ట్రస్ట్‌బోర్డ్ తీర్మానించింది. చైర్మన్ ఐవీ రోహిత్ అధ్యక్షతన శుక్రవారం జరిగిన ఈ సమావేశంలో సభ్యులతో పాటు ఈఓ చంద్రశేఖర్ అజాద్, అసిస్టెంట్ కమిషనర్ రమేష్‌బాబు పాల్గొన్నారు.

ముఖ్య తీర్మానాలివీ..

- ప్రతి గురువారం సత్యదేవుని నిజరూప దర్శనం.
- స్వామి, అమ్మవారు, శివునికి ప్రతి సోమవారం ముత్యాల కవచాలంకరణతో ముత్తంగి సేవకు రూ.9 లక్షలతో ముత్యాల కవచాల తయారీ.
- ప్రదక్షిణ దర్శనం టికెట్ రూ.200 నుంచి రూ.300కు పెంపు.
- సత్యదేవునికి వెండి రథం తయారీకి 3 శాతం తక్కువగా రూ.33 లక్షలకు దాఖలైన టెండర్‌కు ఆమోదం.
- 36 అడుగుల ఎత్తున టేకు రథం తయారీకి 2.96 శాతం తక్కువగా రూ.64.29 లక్షలకు దాఖలైన టెండర్‌కు ఆమోదం. ఈ రథం రక్షణకు కొండ దిగువన రూ.40 లక్షలతో షెడ్డు వేయడానికి టెండర్లు పిలవాలి.
- రూ.1.45 కోట్లతో సీఆర్ఓ కార్యాలయం నుంచి మూడో ఘాట్ రోడ్డుకు కచ్చా రోడ్డుపై బీటీ రోడ్డు నిర్మాణానికి టెండర్లు పిలవాలని నిర్ణయం.
- 30 వీఐపీ సత్రం, క్యాంటీన్‌కు ఎదురుగా ఉన్న పీజీహెచ్ సత్రాలను కూల్చి, వాటిలో మెటీరియల్ తీసుకుని, ఆ స్థలం చదును చేసి ఇచ్చేందుకు టెండర్లు పిలవాలి.
- దేవస్థానంలో వీఐపీలకు వేస్తున్న కండువాలను భక్తులకు కూడా విక్రయించేందుకు, సత్యదేవుని చిత్రం ముద్రించిన శాలువాలు విక్రయించేందుకు టెండర్ పిలవాలని తీర్మానం.
- దేవస్థానం వ్రత మండపాల్లో వృద్ధులు, వికలాంగులకు రూ.24 లక్షలతో చెక్క బల్లల తయారీకి ప్రతిపాదించగా.. చెక్కకు బదులు అగ్ని, నీటికి పాడవని మెటీరియల్‌తో తయారు చేసిన బల్లలు కొనుగోలు చేయాలని తీర్మానం.
- రూ.40 లక్షలతో శివసదన్ సత్రం వెలుపల రోడ్డు, దాతల గదులకు వారి పేర్లతో బోర్డులు, పార్కింగ్‌కు కాంక్రీట్ ఫ్లోరింగ్ చేయాలి.
- తూర్పు రాజగోపురం దక్షిణ భాగంలో షెడ్డు నిర్మాణానికి 15.07 శాతం తక్కువగా రూ.21 లక్షలకు దాఖలైన టెండర్‌కు ఆమోదం
- శివసదన్ సత్రానికి ఫర్నిచర్ సరఫరాకు తక్కువకు దాఖలైన టెండర్ల ఆమోదం.
- 4 బస్సుల కొనుగోలుకు నిర్ణయం.
- ప్రసాదం తయారీ విభాగం ముందు రూ.38.25 లక్షలతో రిటైనింగ్ వాల్ నిర్మాణానికి రూపొందించిన అంచనాలకు ఆమోదం
- రత్నగిరి మెట్ల మార్గంలో రూ.40 లక్షలతో ప్రొఫైల్ షీట్ షెడ్డు నిర్మాణానికి అంగీకారం.
- సీఆర్ఓ కార్యాలయం వద్దకు కేశఖండన శాలను తరలిస్తున్నందున అక్కడ స్థలం చదునుకు 23 శాతం తక్కువగా రూ.11 లక్షలకు దాఖలైన టెండర్‌కు ఆమోదం.
- ఘాట్ రోడ్డు టోల్‌గేట్ వద్ద రూ.90 లక్షలతో ప్రొఫైల్ షెడ్ నిర్మాణానికి టెండర్ పిలవాలని నిర్ణయం.
- దేవస్థానంలో 630 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్లు మూడు, వాటికి కావల్సిన కేబుల్స్, ఏసీల ఏర్పాటుకు రూ.1.37 కోట్లతో టెండర్లు పిలవాలని నిర్ణయం.
- స్వామివారికి సమర్పించిన బంగారు ఆభరణాలు, హుండీలో వచ్చిన బంగారం కరిగించి గోల్డ్‌బాండ్స్‌లో డిపాజిట్ చేయాలని, వెండిని కూడా కరిగించాలని నిర్ణయం.

ముగిసిన నవోదయ క్లస్టర్ పోటీలు

పెద్దాపురం: స్థానిక జవహర్ నవోదయ విద్యాలయలో రెండు రోజుల పాటు నిర్వహించిన క్లస్టర్ స్థాయి బాల్ గేమ్స్ పోటీలు శుక్రవారం ముగిశాయి. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ కె.రామిరెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పెద్దాపురం, గండేపల్లి ఎంఈఓలు ఇ.ప్రభాకరశర్మ, రామకృష్ణారెడ్డి, కేవీ రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడలపై ఆసక్తి చూపాలని, తద్వారా విజయావకాశాలు పెంపొందించుకోవాలని అన్నారు.

క్లస్టర్ లెవెల్ బాల్ గేమ్స్‌లో (వాలీబాల్, హ్యాండ్‌బాల్, బాస్కెట్‌బాల్) నవోదయ తూర్పు గోదావరి 1, 2తో పాటు విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం, కృష్ణా, పశ్చిమ గోదావరి, గుంటూరు, యానాం నవోదయ విద్యాలయాల నుంచి 250 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో ఎంపికైన విద్యార్థులు రీజినల్ లెవెల్ పోటీల్లో పాల్గొంటారని పీఈటీ సత్యనారాయణ తెలిపారు. రీజినల్ లెవెల్‌కు విజయనగరం, కేరళలోని కాసర్‌గోడ్, కర్ణాటకలోని హావేరి నవోదయ విద్యార్థులు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ రామిరెడ్డి తెలిపారు.

గంజాయి కేసులలో ఆరుగురి అరెస్టు

రావులపాలెం: రెండు వేర్వేరు గంజాయి కేసులలో రావులపాలెం పోలీసులు ఆరుగురిని అరెస్టు చేశారు. వారి నుంచి 2.20 కేజీల గంజాయి, ఒక మోటార్ సైకిల్ స్వాధీనం చేసుకున్నారు. సీఐ ఎస్.రజనీకుమార్, ఎస్సై ఎం.వెంకట రమణ శుక్రవారం తెలిపారు. వారి కథనం ప్రకారం.. స్థానిక అమలాపురం రోడ్డులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల వద్ద పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తున్నారు. ఈ క్రమంలో మోటార్ సైకిల్‌పై వస్తున్న ఇద్దరిని అనుమానంతో ప్రశ్నించారు. వారిని అల్లూరు సీతారామరాజు జిల్లా డుంబ్రిగుడ మండలం కొంతగూడ గ్రామానికి చెందిన వంతల కృపారావు, మలికిపురం మండలం గూడపల్లికి చెందిన యేడిద వీర నాగేంద్ర సాకేత్‌గా గుర్తించారు. వీరిద్దరూ కలసి గంజాయి తరలిస్తున్నారు. వారి నుంచి 2 కేజీల గంజాయి, మోటార్ సైకిల్ స్వాధీనం చేసుకున్నారు.

మరో కేసులో రావులపాలెం మండలం పొడగట్లపల్లి శివారు లక్ష్మీపాలెం ఐస్ ఫ్యాక్టరీ ఎదురుగా గంజాయి తాగుతున్న నలుగురిని పోలీసులు పట్టుకున్నారు. కాలువ అవతల పొడగట్లపల్లి వెళ్లే దారిలోని ఖాళీ ప్రదేశంలో వీరు గంజాయి తాగుతున్నట్టు అందిన సమాచారంతో దాడి చేశారు. వీరిని నెల్లి శశాంక సిన్హా (రాజమహేంద్రవరం), వెంట్రపాటి అనిల్ కుమార్ (లక్ష్మీపాలెం), పెరవలి బాలసాయి (రావులపాలెం), బండి మనోహర్ దొరై(పొడగట్లపల్లి)గా గుర్తించారు. ఒక్కొక్కరి వద్ద 5 గ్రాముల చొప్పున మొత్తం 20 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. వీరిలో బాలసాయి, మనోహర్ దొరైలు గతంలో గంజాయి దాడుల్లో పట్టుబడ్డారని, వీరు గ్రామ సచివాలయ అగ్రికల్చర్ అసిస్టెంట్లుగా పని చేస్తున్నట్టు గుర్తించామని సీఐ, ఎస్సై తెలిపారు.

డాక్టర్ కావాలంటే నిత్య విద్యార్థి కావాలి


సదస్సులో పాల్గొన్న విద్యార్థులు, తల్లిదండ్రులు

ఉండ్రాజవరం: డాక్టర్ కోర్సుకావాలంటే చదువుతో పాటు క్రమశిక్షణ, ధైర్యం కావాలని శశి విద్యా సంస్థల చైర్మన్ బూరుగుపల్లి రవికుమార్ అన్నారు. నీట్–2023లో ర్యాంకులు సాధించిన విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు వేలివెన్ను శశి ఆధ్వర్యాన రాజమహేంద్రవరంలో శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఏటా తమ విద్యా సంస్థ నుంచి 200 మందికి తగ్గకుండా మెడికల్ సీట్లు సాధిస్తున్నారని చెప్పారు. ఈ విద్యా సంవత్సరం కూడా 300 సీట్లు వచ్చే అవకాశం ఉందని అన్నారు. వైఎస్సార్ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ వైస్ చాన్సలర్ కోరుకొండ బాబ్జీ మాట్లాడుతూ, ఇంటర్ వరకూ తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రోద్బలంతో చదువుతారని, అదే ఎంబీబీఎస్‌కు వచ్చేసరికి విద్యార్థి సొంతంగా నేర్చుకోవలసి ఉంటుందని అన్నారు.

ఎంబీబీఎస్‌లో పుస్తకాలు చదవడంతో పాటు ప్రాక్టికల్స్ చేస్తూ నిరంతర విద్యార్థిగా ఉండాలని అన్నారు. వైఎస్సార్ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ జాయింట్ రిజిస్ట్రార్ వీవీ సుబ్బారావు మాట్లాడుతూ, కౌన్సెలింగ్‌కు హాజరయ్యే విద్యార్థులు తమకు నచ్చిన అన్ని ప్రభుత్వ, ప్రైవేటు కాలేజీలను ఒకేసారి ఎంపిక చేసుకోవాలని, ర్యాంకు ఆధారంగా సీటు కేటాయిస్తారని చెప్పారు. కౌన్సెలింగ్‌పై తల్లిదండ్రులు, విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. సాగర్ హస్పిటల్ వైద్యుడు పి.రవికిరణ్ మాట్లాడుతూ, ప్రతి విద్యార్థీ కష్టపడి ఎంబీబీఎస్‌తో పాటు ఎండీ చేయాలని సూచించారు. శశి అకాడమిక్ డైరెక్టర్ శేషుబాబు మాట్లాడుతూ, కళాశాల విద్య వరకూ విద్యార్థుల ఒత్తిడిని తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు షేర్ చేసుకుంటారని, ఎంబీబీఎస్‌లో వారే చూసుకోవాలని అన్నారు.

జేగురుపాడు గ్రామ పంచాయతీ మరో రికార్డ్

జగనన్న పచ్చ తోరణం ద్వారా మొక్కల ఉత్పత్తి, ఉచిత పంపిణీ


సీతానగరానికి మొక్కల పంపిణీలో జేగురుపాడు సర్పంచ్ స్టాలిన్

కడియం: గ్రామ స్వపరిపాలనలో తనదైన ముద్ర వేసుకున్న జేగురుపాడు గ్రామ పంచాయతీ మరో రికార్డ్ సాధించింది. ఉపాధి హామీ పథకంలో భాగంగా డ్వామా ద్వారా ఈ గ్రామ పంచాయతీ ప్రభుత్వ స్థలంలో తొలిసారిగా నర్సరీ అభివృద్ధి చేసి, పలు రకాల మొక్కలు ఉత్పత్తి చేసింది. గ్రామంలో రోడ్లకు ఇరువైపులా మొక్కలు పెంచడమే కాకుండా, మిగులు మొక్కలను ఇతర గ్రామాలకు పంపిణీ చేస్తోంది. రాజానగరం నియోజకవర్గంలోని సీతానగరం గ్రామానికి శుక్రవారం 2 వేల మొక్కలు ఈ విధంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ రత్నకుమారి మాట్లాడుతూ, జేగురుపాడు సర్పంచ్ యాదల సతీష్‌చంద్ర స్టాలిన్ కృషిని అభినందించారు. జగనన్న పచ్చతోరణం అభివృద్ధికి ఈ పంచాయతీ చేస్తున్న కృషిని ఇతర గ్రామాలు కూడా ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి శిరీష, ఉపాధి హామీ పథకం టెక్నికల్ అసిస్టెంట్ డీఎన్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

సీఎం జిల్లా వారైతే అనర్హులా!

ఫ్యాక్ట్ చెక్

సాక్షి, అమరావతి: విదేశీయులు మన దేశంలో కంపెనీలు, పరిశ్రమలు స్థాపిస్తున్నారు. మన రాష్ట్రం నుంచి ఎంతో మంది దేశ, విదేశాల్లో పెట్టుబడులు పెడుతున్నారు. పారిశ్రామిక, వ్యాపార, వాణిజ్య కార్యకలాపాలకు ఆ ఊరు, ఈ ఊరు అనే తేడా లేదు. జిల్లా నుంచి జాతీయ, అంతర్జాతీయ స్థాయి వరకు ఎక్కడైనా అర్హత ఉన్న ఎవరైనా చట్టం, నిబంధనల మేరకు ఏదైనా చేయవచ్చు. దీనిని విశ్వవ్యాప్తంగా ఎవరూ కాదనరు. కానీ ఈనాడుకు మాత్రం సీఎం సొంత జిల్లా వారు ఎలాంటి వ్యాపారాలు చేయకూడదని, టెండర్లు దక్కించుకోకూడదన్న అభిప్రాయం నరనరానా జీర్ణించుకుపోయింది. అందుకే వారు వ్యాపారాలకు అనర్హులనేలా కథనాలు అల్లుతోంది. పెరుగుతున్న రాష్ట్ర విద్యుత్ అవసరాలు తీర్చ దానికి సీలేరులో రెండు అదనపు విద్యుత్ ఉత్పత్తి యూనిట్ల నిర్మాణానికి ఆంధ్రప్రదేశ్ పవర్ జనరేషన్ కార్పొరేషన్ (ఏపీ జెన్‌కో) టెండర్లు పిలిచింది. అత్యంత పారదర్శకంగా బిడ్లు ఆహ్వానించి, రివర్స్ టెండరింగ్ ద్వారా టెండరు ఖరారు చేసింది. కానీ ఇదంతా తప్పన్నట్టు 'ఈనాడు' శుక్రవారం ఓ తప్పుడు కథనాన్ని ప్రచురించింది. ఆ పత్రిక అధినేత రామోజీరావు పచ్చళ్లు అమ్ముకోవచ్చు.. పత్రికనూ నడుపుకోవచ్చు.. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు తయారు చేసే కంపెనీకి మాత్రం విద్యుత్ ఉత్పత్తి ప్రాజెక్టు టెండర్ ఇవ్వకూడదు. వారికి, వారు కొమ్ముకాస్తున్న వారికి ఒక న్యాయం.. సీఎం సొంత జిల్లా వారైతే మరో న్యాయం.. ఇదేం రామోజీ జర్నలిజం. ఏపీ జెన్‌కో వెల్లడించిన వివరాల ప్రకారం ఈ టెండర్లలో వాస్తవాలు అంశాల వారీగా ఇలా ఉన్నాయి.

ఆరోపణ: వైఎస్సార్ జిల్లాకు చెందిన షిర్డీ సాయి ఎలక్ట్రికల్స్‌కు రాష్ట్ర ప్రభుత్వం మరో భారీ విద్యుత్ ప్రాజెక్టును కట్టబెట్టింది. ఈ సంస్థ వైఎస్సార్ జిల్లాకు చెందిన వ్యక్తికి సంబంధించినది కావడమే దానికి ఉన్న ఏకైక అర్హత.

వాస్తవం: ఏపీ జెన్‌కో అత్యంత పారదర్శకంగా నిర్వహించిన రివర్స్ టెండరింగ్ ద్వారానే షిర్డీ సాయి ఎలక్ట్రికల్స్ ఈ కాంట్రాక్టును కైవసం చేసుకుంది. ఇందులో ఏపీ జెన్‌కో, ప్రభుత్వం ప్రమేయం ఏమీ లేదు. ఈ కన్సార్టియం భారత ప్రభుత్వ రంగ సంస్థ అయిన ప్రతిష్టాత్మక బీహెచ్ఈఎల్‌తో ఈ ప్రాజెక్టు యంత్ర పరికరాల సరఫరాకు అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ప్రస్తుతం ఉన్న యూనిట్లకు కూడా బీహెచ్ఈఎల్ యంత్ర పరికరాలు సరఫరా చేసింది. కన్సార్టియంలోని మరో కంపెనీ పీఈఎస్‌కు ఇదివరకే ఈ ప్రాజెక్టులో సివిల్ పనులు చేసిన అనుభవముంది. ఈ విషయాలన్నీ పరిగణనలోకి తీసుకుని, కాంట్రాక్టు సంస్థను ఎంపిక చేసింది. ఈ ప్రాజెక్టు పనులు ప్రారంభమయ్యాయి. ఏప్రిల్ 2024కల్లా పూర్తవుతాయి.

ఆరోపణ: దిగువ సీలేరులో రెండు అదనపు యూనిట్ల నిర్మాణానికి అయ్యే వ్యయం, జీఎస్టీ, ఆలస్యానికి అయ్యే వడ్డీతో కలిపి రూ. 571 కోట్ల రుణాన్ని గ్రామీణ విద్యుత్ సంస్థ (ఆర్ఈసీ) నుంచి ప్రభుత్వం తీసుకుంది.

వాస్తవం: పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌ను తీర్చడానికి ప్రాజెక్టుల నిర్మాణం కోసం రుణం తీసుకోవడం సర్వసాధారణం. ఇందులో తప్పేముంది?

ఆరోపణ: ఇప్పటికే షిర్డీ సాయి, దాని అనుబంధ సంస్థలకు రూ. 92 వేల కోట్ల విలువైన వివిధ విద్యుత్ ప్రాజెక్టులను ప్రభుత్వం కట్టబెట్టింది.

వాస్తవం: ఏపీ జెన్‌కోగానీ, డిస్కంలు గానీ నామినేషన్ పద్ధతిలో ఏ పనులూ ఎవరికీ కేటాయించలేదు. వివిధ ప్రాజెక్టుల కోసం పారదర్శకంగా టెండర్లు నిర్వహించాయి. అర్హతల మేరకు పోటీ బిడ్డింగ్‌లో పాల్గొని ఏ సంస్థ అయినా పనులు దక్కించుకోవచ్చు.

ఆరోపణ: ట్రాన్స్‌ఫార్మర్లు తయారు చేసే కంపెనీకి జల విద్యుత్ ప్రాజెక్టు నిర్మాణ పనులను ప్రభుత్వం కట్టబెట్టింది.

వాస్తవం: అంతర్జాతీయ పోటీ బిడ్డింగ్ (గ్లోబల్ టెండర్లు- ఇ ప్రొక్యూర్మెంట్ ప్లాట్‌ఫారం) ద్వారా ఏపీ జెన్‌కో టెండర్లు పిలిచింది. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన జుడిషియల్ కమిషన్ కూడా సమీక్షించి ఈ ప్రాజెక్టు టెండర్లకు ఆమోదం తెలిపింది. రాఘవ ఎంటర్‌ప్రైజెస్, ఎన్‌సీసీ, పీఈఎస్ ఇంజినీరింగ్ ప్రైవేట్ లిమిటెడ్‌తో కలిపి షిర్డీసాయి ఎలక్ట్రికల్స్ జాయింట్ వెంచర్ సంస్థ బిడ్లు దాఖలు చేసింది. టెండర్లలో కోట్ అయిన అతి తక్కువ మొత్తాన్ని గరిష్టంగా తీసుకుని ఏపీజెన్‌కో రివర్స్ టెండర్లు నిర్వహించింది. ఈ రివర్స్ టెండరింగ్‌లో షిర్డీసాయి ఎలక్ట్రికల్స్ సంస్థ తక్కువ మొత్తానికి ప్రాజెక్టు పనులు చేపట్టేందుకు ముందుకు వచ్చి కాంట్రాక్టు దక్కించుకుంది. రెండు దశల (సాంకేతిక, ఆర్థిక) బిడ్డింగ్ ప్రాతిపదికన ప్రాజెక్టును అభివృద్ధి చేసేందుకు సంస్థను ఎంపిక చేసింది. రివర్స్ టెండరింగ్ ప్రక్రియ వల్ల ఏపీ జెన్కోకు దాదాపు రూ.10 కోట్లు ఆదా అయ్యింది.

ఆరోపణ: ప్రాజెక్టు నిర్మాణానికి అవసరమైన పర్యావరణ, రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి (ఏపీఈఆర్‌సీ) అనుమతులు రాకముందే హడావుడి చేసింది.

వాస్తవం: విద్యుత్ కేంద్రం ప్రతిపాదనను ఏపీఈఆర్‌సీకి ముందే చెప్పారు. ప్రతిపాదనను పరిశీలించి డిస్కంలు, జెన్‌కో కొనుగోలు ఒప్పందం (పీపీఏ) కుదుర్చుకుని కమిషన్ అనుమతి కోసం అప్పుడు పంపాలని ఆదేశించారు. ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి అనుమతి ఈ నెల 7న వచ్చింది. ఈ ప్రాజెక్టు పెట్టుబడి వ్యయం రూ.1000 కోట్లు దాటనందున కేంద్ర విద్యుత్ ప్రాధికారిక సంస్థ (సీఈఏ) అనుమతి అవసరం లేదు.

ఆరోపణ: రెండు కొత్త యూనిట్లు నిర్మించడం వల్ల దిగువ సీలేరు ప్రాజెక్టు నుంచి అదనంగా ఒక్క యూనిట్ విద్యుత్ కూడా ఉత్పత్తి అయ్యే పరిస్థితి లేదు.

వాస్తవం: జల విద్యుత్ కేంద్రాలలో విద్యుత్ ఉత్పత్తి మన గ్రిడ్ అవసరాలకు అనుగుణంగా మార్చుకునే వెసులుబాటు ఉంటుంది. ప్రస్తుతం ఉన్న నాలుగు 115 మెగావాట్ల యూనిట్లు ఏటా దాదాపు 1100 మిలియన్ యూనిట్లను ఉత్పత్తి చేస్తున్నాయి. దిగువ సీలేరు విద్యుత్ కేంద్రం మొట్టమొదట నిర్మించినప్పుడే ఆరు యూనిట్ల ఏర్పాటుకు కావలసిన ప్రధాన మౌలిక సదుపాయాలు కల్పించారు. దీంతో అదనంగా మరో రెండు 115 మెగావాట్ల యూనిట్లు నిర్మించాలని ఏపీ జెన్‌కో నిర్ణయించింది. కొత్త యూనిట్లు నెలకొల్పడం వల్ల ఈ విద్యుత్ కేంద్రం గరిష్ట లోడ్ సామర్థ్యం పెరుగుతుంది. దాంతో మార్కెట్ నుంచి అధిక ధరలకు విద్యుత్ కొనవలసిన అవసరం తగ్గుతుంది. ప్రతి 115 మెగావాట్ల యంత్రం పీక్ డిమాండ్ సమయంలో సగటున 175 మిలియన్ యూనిట్లు ఉత్పత్తి చేయగలదు. దీనివల్ల డిస్కంలకు ఏటా 350 మిలియన్ యూనిట్లు విద్యుత్ మార్కెట్‌లో కొనాల్సిన అవసరం తగ్గి, ఆ మేరకు లాభం చేకూరుతుంది. పీక్ సమయాల్లో మార్కెట్ రేటు యూనిట్‌కు దాదాపు రూ.10 ఉంటోంది. సరాసరి పీక్ లోడ్ విద్యుత్ ధర రూ.8.0 అనుకున్నా ఈ రెండు యూనిట్ల వల్లా ఏటా దాదాపు రూ .280 కోట్లు ఆదా అవుతుంది.

నా వాంగ్మూలాన్ని తప్పుగా రికార్డు చేశారు

► మొదటి పేజీ తరువాయి



ఉల్లంఘించడమే అవుతుందని పేర్కొన్నారు. సీబీఐ డైరెక్టర్‌ని, వివేకా కేసు విచారణాధికారి (ఎఎస్పీ)ని ప్రతివాదులుగా చేర్చారు. పిటిషన్‌లో ఆయన పేర్కొన్న వివరాలు.. 'ఏప్రిల్ 29న నేను వాంగ్మూలం ఇస్తుండగా.. అధికారి మరొకరిని లోపలికి పిలిచారు. ఆయన లాప్‌ట్యాప్‌తో వచ్చి ఏదో రికార్డు చేసుకున్నాడు. ఆయన ఏం రికార్డు చేసింది నాకు చూపించలేదు. కనీసం చదివి వినిపించలేదు. నాకు తెలిసినంతవరకు నా వాంగ్మూలాన్ని ఆడియో, వీడియో రికార్డు కూడా చేయలేదు. సీబీఐ నా స్టేట్‌మెంట్‌ను తప్పుడు రికార్డు చేసినట్లు మే 17న ఓ పత్రికలో ప్రచురితమైన వార్త ద్వారా తెలుసుకున్నా. నా వాంగ్మూలం గురించి నేను ఎవరి వద్దా ప్రస్తావించలేదు. కానీ, ఆ పత్రికలో ఎలా వచ్చిందో నాకు అర్థంకాలేదు. ఆశ్చర్యం వేసింది. ఆ పత్రికలో పేర్కొన్నదంతా అసత్యపూరితం. పత్రికలో వచ్చిన దానిపై ఎలక్ట్రానిక్ మీడియా చర్చా కార్యక్రమాలు పెట్టడంతో నేను విలేకరుల సమావేశం పెట్టి.. ఆ పత్రికది కట్టుకథ అని చెప్పాల్సి వచ్చింది. సీబీఐ నమోదు చేసింది కూడా నేను చెప్పింది కాదని తెలిసింది. అయితే సీఆర్‌పీసీ 161 కింద రికార్డు చేసిన కాపీ నావద్ద లేనందున నా వాంగ్మూలం తప్పుగా పేర్కొన్న విషయాన్ని తెలుసుకోలేకపోయా. 2019 మార్చి 15న ఉదయం 5.30 గంటల సమయంలో అటెండరు వచ్చి అమ్మ (భారతి) పిలుస్తున్నారంటూ జగన్‌కు చెప్పాడని తాను చెప్పినట్లు, బయటకు వెళ్లిన జగన్ పది నిమిషాల తరువాత తిరిగివచ్చి చిన్నాన్న ఈజ్ నో మోర్ అని అన్నారని, షాక్‌కు గురైన మేము కడపకు వెళ్లాలని ఆయనకు సూచించి బయటకు వచ్చేశామని జూన్ నెలలో వేసిన చార్జిషీట్‌లో సీబీఐ పేర్కొంది. ఈ విషయం పత్రికల్లో వచ్చిన సమాచారం ద్వారా నాకు తెలిసింది.

ఏం చెప్పానంటే..

ఏప్రిల్ 29న నన్ను విచారించిన అధికారికి స్పష్టంగా ఏం చెప్పానంటే.. వైఎస్సార్‌సీపీ మేనిఫెస్టో తయారీ సమావేశం 2019 మార్చి 15న ఉదయం సుమారు 5 గంటలకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇంట్లో ప్రారంభమైంది. అరగంట తర్వాత ఒక అటెండర్ సమావేశగది తలుపు తట్టాడు. బయటికి వెళ్లి విషయం తెలుసుకుని వచ్చిన ఓఎస్డీ.. జగన్ చెవిలో ఏదో చెప్పారు. దీంతో జగన్ మోహన్‌రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతికి, ఆశ్చర్యానికి గురయ్యారు. 'చిన్నాన్న చనిపోయారు' అని చెప్పారు. అంతేతప్ప జగన్‌మోహన్‌రెడ్డిని ఆయన జీవిత భాగస్వామిని పిలవడం లాంటివి ఏమీ చెప్పలేదు. దురదృష్టవశాత్తు నేను చెప్పింది సీబీఐ సరిగ్గా రికార్డు చేయలేదు. చార్జిషీట్‌లో సీబీఐ పేర్కొంది పూర్తిగా అసంబద్ధం. దర్యాప్తును తప్పుదారి పట్టించి.. ఇతరులను కేసులో ఇరికించే ధోరణితోనే సీబీఐ ఇలా తప్పుగా పేర్కొంది. నా స్టేట్‌మెంట్‌పై సంతకం చేసిన అధికారి, నన్ను విచారించిన అధికారి ఒకరు కాదు. దర్యాప్తు అధికారులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలని రాజ్యాంగ ధర్మాసనాలు పదేపదే చెబుతున్నా.. కొందరు మాత్రం వాటిని పట్టించుకోకుండా వ్యవహరిస్తున్నారు. దర్యాప్తు చేయడం అంటే అస్పష్టమైన సత్యాన్ని బయటికి తీసుకురావడం. కానీ, ఇక్కడ అధికారులు అలా వ్యవహరించలేదు. నేను చెప్పకున్నా చెప్పినట్లు సీబీఐ తప్పుడు వాంగ్మూలాన్ని సమర్పించడం ఎంత మాత్రం సరికాదు. ఇతర వ్యక్తులను చిక్కుల్లో పడేసేందుకే సీబీఐ తప్పుడు సమాచారం చేర్చింది. ఈ అంశాలను పరిశీలించి హైదరాబాద్ సీబీఐ కోర్టులో సమర్పించిన చార్జిషీట్ నుంచి తప్పుడు వాంగ్మూలాన్ని తొలగించాలి.'

ఏపీ ఇన్ పార్లమెంట్

ప్రత్యేకదళాల్లో చేరికకు లింగభేదం లేదు

సాక్షి, న్యూఢిల్లీ: భారత సాయుధ దళాల్లోని ప్రత్యేకదళాల్లో చేరడానికి లింగభేదం లేదని కేంద్ర రక్షణశాఖ సహాయమంత్రి అజయ్ భట్ తెలిపారు. గుణాత్మక అవసరాల మేరకు ఎంపిక, విజయవంతమైన శిక్షణ పూర్తిచేస్తే మహిళా అధికారులు ఎలాంటి లింగభేదం లేకుండా ప్రత్యేకదళాల్లో స్వచ్ఛందంగా చేరడానికి అర్హులని చెప్పారు. లోక్‌సభలో శుక్రవారం వైఎస్సార్‌సీపీ ఎంపీలు వంగా గీత, బి.వి.సత్యవతి, గొడ్డేటి మాధవి, ఆదాల ప్రభాకరరెడ్డి ప్రశ్నకు మంత్రి సమాధానమిచ్చారు. భారత వైమానిక దళంలో ఇద్దరు మహిళలు ప్రత్యేకదళాల శిక్షణకు స్వచ్ఛందంగా వచ్చారని, అయితే వారు ఉత్తీర్ణత సాధించలేకపోయారని తెలిపారు. నేవీలో 20 మంది అగ్నివీర్‌లు ప్రత్యేకదళంలో చేరడానికి పరీక్షకుహాజరయ్యారని, వారెవరూ అర్హత సాధించలేకపోయారని చెప్పారు.

దేశవ్యాప్తంగా 122 మంది మెడికోల ఆత్మహత్య

దేశవ్యాప్తంగా 559 వైద్య కళాశాలలు ఇచ్చిన సమాచారం మేరకు 122 మంది వైద్య విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నారని కేంద్ర ఆరోగ్యశాఖ సహాయమంత్రి భారతీప్రవీణ్ పవార్ తెలిపారు. వైఎస్సార్‌సీపీ ఎంపీ బాలశౌరి ప్రశ్నకు మంత్రి జవాబిస్తూ.. నేషనల్ మెడికల్ కమిషన్‌లోని యాంటీ ర్యాగింగ్ కమిటీ ఆర్‌టీఐ దరఖాస్తుకు సమాధానంగా ఐదేళ్లలో ఆత్మహత్యలు, డ్రాప్ అవుట్‌ల వివరాలు ఇచ్చిందని చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లో పీజీలో ఒక విద్యార్థి ఆత్మహత్య చేసుకోగా.. తొమ్మిది కళాశాలల్లో 38 మంది విద్యార్థులు డ్రాప్ అవుట్ అయ్యారని తెలిపారు. ఎంబీబీఎస్‌లో మూడు కళాశాలల్లో ఐదుగురు విద్యార్థులు ఆత్మహత్య చేసుకోగా.. ఆరు కళాశాలల్లో 13 మంది విద్యార్థులు డ్రాప్ అవుట్ అయ్యారని చెప్పారు.

మైన్స్ మినరల్స్ సవరణ బిల్లుకు వైఎస్సార్‌సీపీ మద్దతు

మైన్స్, మినరల్స్ సవరణ బిల్లు-2023కు వైఎస్సార్‌సీపీ మద్దతు తెలిపింది. ఈ బిల్లుపై శుక్రవారం లోక్‌సభలో జరిగిన చర్చలో వైఎస్సార్‌సీపీ ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి మాట్లాడారు. ఏపీ ప్రభుత్వం 16,604 ఎకరాల్లో 16 బీచ్‌శాండ్ మినరల్స్ బేరింగ్ ఏరియాలను ఏపీ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్‌కు రిజర్వు చేసిందని తెలిపారు. 14 మినరల్ బేరింగ్ ఏరియాలకు సంబంధించి డిపార్టుమెంట్ ఆఫ్ అటామిక్ ఎనర్జీ వద్ద పెండింగ్‌లో ఉన్నట్లు చెప్పారు. ఇంటిగ్రేటెడ్ బీచ్‌శాండ్ మినరల్స్ ప్రాజెక్టులు అభివృద్ధి చేయాలని ఏపీ ప్రభుత్వం యోచిస్తోందని తెలిపారు. ఏపీ ప్రభుత్వం వైఎస్సార్ స్టీల్ కార్పొరేషన్ లిమిటెడ్ స్థాపించి వైఎస్సార్ జిల్లాలో ఉక్కు కర్మాగారం ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. తద్వారా రాయలసీమ ప్రజలకు స్థిరమైన ఉపాధి, జీవనోపాధి అవకాశాలు మెరుగవుతాయని చెప్పారు. ఉక్కు కర్మాగారం ఏడాదికి మూడు మిలియన్ టన్నుల సామర్థ్యంతోపాటు హై-గ్రేడ్ స్టీల్ ఉత్పత్తిపై దృష్టి సారిస్తుందని తెలిపారు.

మాయల ఫకీరు బాబు మాయలో పడొద్దు

- పురందేశ్వరి వ్యాఖ్యలపై మంత్రి గుడివాడ అమర్‌నాథ్ కౌంటర్

సాక్షి, విశాఖపట్నం: బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి మాటలు ఆమె మరిది చంద్రబాబు స్క్రిప్టులా ఉన్నాయి తప్ప సొంతంగా మాట్లాడారని అనిపించడంలేదని రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. ఆమె బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలా? లేక బాబు గారి జనతా పార్టీకి అధ్యక్షురాలా? అనే సందేహం వస్తోందన్నారు. మంత్రి శుక్రవారం ఇక్కడ మీడియాతో మాట్లాడుతూ.. మాయల ఫకీరు చంద్రబాబు ట్రాప్‌లో పడితే పురందేశ్వరి భర్త దగ్గుబాటి వెంకటేశ్వర్లు రాజకీయ జీవితం భూస్థాపితం అయిపోయినట్లే ఆమె రాజకీయ జీవితమూ ముగిసిపోతుందని చెప్పారు. ఆమె భర్త ఆనాడు రాసిన పుస్తకానికి పార్ట్-2 రాయాల్సిన పరిస్థితి వస్తుందని అన్నారు. రాష్ట్రంలో సంక్షేమ పథకాలన్నీ మద్యం ఆదాయంతోనే ఇస్తున్నారని అంటున్నారని, బీజేపీ పాలిత రాష్ట్రాల్లో మద్యం లేదా? ఆదాయం రావడంలేదా అని ప్రశ్నించారు. వివిధ విభాగాల ఆదాయంతోనే ప్రతి రాష్ట్రంలో ప్రభుత్వ నిర్ణయాలు, హామీలను అమలు చేస్తారని చెప్పారు. పురందేశ్వరి ఆమె మరిది బాబు హయాంలోని భూ కుంభకోణాలపై ఎందుకు మాట్లాడరని ప్రశ్నించారు. విశాఖ ఎంపీగా చేసిన ఆమె విశాఖ రైల్వే జోన్‌పైన, విశాఖ ఉక్కు పైన ఎందుకు మాట్లాడటంలేదని నిలదీశారు.

సినిమా

పట్టుకుంటే పది వేలు



• ధనుష్

బందిపోటుగా, హంతకుడిగా ముద్రపడిన 'కెప్టెన్ మిల్లర్'ను పట్టుకున్న వారికి పదివేల రూపాయల రివార్డును ప్రకటిస్తూ 1930లో ఓ పోలీస్ నోట్ విడుదలైంది. మరి.. అప్పటి ప్రభుత్వానికి కెప్టెన్ మిల్లర్ చిక్కాడా? అసలు అతని కథ ఏంటి? అనే ప్రశ్నలకు సమాధానాలు డిసెంబరులో థియేటర్స్‌లో దొరుకుతాయి. ధనుష్ టైటిల్ రోల్‌లో నటిస్తున్న చిత్రం 'కెప్టెన్ మిల్లర్'. అరుణ్ మాథేశ్వరన్ దర్శకత్వంలో టీజీ త్యాగరాజన్, సెంథిల్ త్యాగరాజన్, అర్జున్ త్యాగరాజన్ నిర్మిస్తున్నారు. శుక్రవారం (జూలై 28) ధనుష్ బర్త్ డే. ఈ సందర్భంగా 'కెప్టెన్ మిల్లర్' టీజర్‌ను విడుదల చేసి, సినిమాను డిసెంబరు 15న విడుదల చేస్తున్నట్లుగా చిత్ర యూనిట్ వెల్లడించింది. హైదరాబాద్‌లో జరిగిన ఈ సినిమా టీజర్ లాంచ్ ఈవెంట్‌లో 'కెప్టెన్ మిల్లర్'లో కీలక పాత్ర చేసిన హీరో సందీప్ కిషన్ మాట్లాడుతూ- ''ఇది నాకు చాలా ప్రత్యేకమైన సినిమా. ఈ సినిమా కాకుండా ధనుష్ అన్న దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'డీ 50'లోనూ ఓ కీలక పాత్రలో నటిస్తున్నాను'' అని అన్నారు. ''1930-1940 నేపథ్యంలో ఈ సినిమా కథనం ఉంటుంది. యాక్షన్ సన్నివేశాలు అద్భుతంగా ఉంటాయి'' అని చిత్ర యూనిట్ పేర్కొంది. ప్రియాంకా అరుళ్ మోహనన్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రంలో శివరాజ్‌కుమార్ కీ రోల్ చేస్తున్నారు.

నెచ్చెలి విసిరినది వెచ్చని వల...



• సమంత, విజయ్ దేవరకొండ

'**ఖు**షీ నువ్వు కనబడితే.. ఖుషీ నీ మాట వినబడితే...' అంటూ మొదలైంది 'ఖుషి' సినిమా టైటిల్ సాంగ్. విజయ్ దేవరకొండ, సమంత జంటగా నటించిన చిత్రం ఇది. శివ నిర్వాణ దర్శకత్వంలో నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ నిర్మించారు. తెలుగు, తమిళ, మలయాళ, కన్నడ, హిందీ భాషల్లో ఈ చిత్రం సెప్టెంబరు 1న విడుదల కానుంది. ఈ సినిమా టైటిల్ సాంగ్ లిరికల్ వీడియోను శుక్రవారం విడుదల చేశారు. 'ఖుషీ నువ్వు కనబడితే' అని మొదలై, 'హే నెచ్చెలి నెచ్చెలి వచ్చి విసిరినది వెచ్చని వెచ్చని వల.. హే ముచ్చటగా నను గిల్లి గిచ్చినది కల..' అంటూ సాగుతుందీ పాట. దర్శకుడు శివ నిర్వాణ ఈ పాటకు లిరిక్స్ అందించగా, ఈ చిత్ర సంగీత దర్శకుడు హిషామ్ అబ్దుల్ వాహబ్ పాడారు.

లక్కీ భాస్కర్



• దుల్కర్ సల్మాన్

'**మ**హానటి, సీతారామం' వంటి వరుస విజయాల తర్వాత తెలుగులో దుల్కర్ సల్మాన్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రానికి 'లక్కీ భాస్కర్' అనే టైటిల్‌ని ఖరారు చేశారు. ధనుష్‌తో 'సార్' వంటి బ్లాక్ బస్టర్ తర్వాత వెంకీ అట్లూరి దర్శకత్వం వహిస్తున్న చిత్రమిది. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సూర్యదేవర నాగ వంశీ, సాయి సౌజన్య ఈ చిత్రాన్ని పాన్ ఇండియా స్థాయిలో నిర్మిస్తున్నారు. శుక్రవారం (జూలై 28) దుల్కర్ సల్మాన్ పుట్టినరోజుని పురస్కరించుకుని ఈ చిత్రానికి 'లక్కీ భాస్కర్' అనే టైటిల్‌ని ప్రకటించారు. ''నమ్మశక్యం కాని విధంగా ఉన్నత శిఖరాలకు చేరిన ఒక సాధారణ మనిషి కథగా 'లక్కీ భాస్కర్' రూపొందుతోంది. ఈ చిత్రం ద్వారా వెంకీ అట్లూరి మరో విభిన్న కథాంశంతో ప్రేక్షకులను మెప్పించడానికి సిద్ధమవుతున్నారు'' అని నిర్మాతలు అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: జీవీ ప్రకాష్ కుమార్.

'**కాంత**'.. దుల్కర్ బర్త్ డే సందర్భంగా 'కాంత' అనే మరో చిత్రం ప్రకటన వెల్లడైంది. ఈ చిత్రంలో దుల్కర్ హీరోగా నటించడంతో పాటు రానాతో కలిసి నిర్మిస్తున్నారు. గతంలో 'నిలా' చిత్రం, 'ద హంట్ ఆఫ్ వీరప్పన్' డాక్యుమెంటరీ సిరీస్‌లకు దర్శకత్వం వహించిన దర్శకుడు సెల్వమణి సెల్వరాజ్ 'కాంత'ను తెరకెక్కించనున్నారు.



• అదితీరావ్ హైదరి

అంతా మంచే జరుగుతుంది

\- విష్ణు మంచు



• తేజ్, విష్ణు మంచు, రిషిక

''**ఇం**డస్ట్రీలో ఓ యాక్టర్‌కి, మేకప్ మేన్‌కి ఉన్న బంధం భార్యాభర్తల్లాంటిది. నేను చిన్నప్పటి నుంచి మేకప్‌మేన్ చంద్రగారిని చూస్తున్నాను. ఓ రైటర్‌గా, డైరెక్టర్‌గా, నిర్మాతగా సినిమా చేయటం అంత సులభం కాదు.. ఆయన మంచి మనసుకి అంతా మంచే జరుగుతుంది. 'మాధవే మధుసూదనా' సినిమా పెద్ద సక్సెస్ కావాలి'' అని హీరో విష్ణు మంచు అన్నారు. తేజ్ బొమ్మదేవర, రిషికా లోక్రే జంటగా రూపొందుతోన్న చిత్రం 'మాధవే మధుసూదనా'. బొమ్మదేవర శ్రీదేవి సమర్పణలో బొమ్మదేవర రామచంద్ర రావు స్వీయ దర్శకత్వంలో నిర్మిస్తున్నారు. ఈ చిత్రం టీజర్‌ను విష్ణు మంచు రిలీజ్ చేశారు. బొమ్మదేవర రామచంద్ర రావు మాట్లాడుతూ-'' నన్ను ఈ స్థాయిలో నిలబెట్టిన అన్నపూర్ణ స్టూడియో సంస్థకు, నాగార్జునగారికి రుణపడి ఉంటాను. మోహన్ బాబుగారు సింగపూర్‌లో ఉండటం వల్ల ఆయన స్థానంలో విష్ణుని పంపించినందుకు కృతజ్ఞతలు'' అన్నారు.

హద్దుల్లో ఉంటే అడ్డే ఉండదు

\- హీరోయిన్ శ్రీలీల



''**చి**త్ర పరిశ్రమ అనేది గౌరవం ఉన్న ఇండస్ట్రీ. మన హద్దుల్లో మనం ఉండి సినిమాలు చేసుకుంటే అడ్డేదీ ఉండదు.. ఎలాంటి ఇబ్బందులు రావు. తెలుగమ్మాయి అయిన హీరోయిన్ ప్రణవికి నేను ఇచ్చే సలహా ఇదే'' అని హీరోయిన్ శ్రీలీల అన్నారు. సంజయ్ రావు, ప్రణవి మానుకొండ జంటగా ఏఆర్ శ్రీధర్ దర్శకత్వం వహించిన చిత్రం 'స్లమ్ డాగ్ హజ్బెండ్'. అప్పిరెడ్డి, వెంకట్ అన్నపరెడ్డి నిర్మించిన ఈ సినిమా రిలయన్స్ ఎంటర్‌టైన్మెంట్ ద్వారా నేడు రిలీజవుతోంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో జరిగిన ఈ సినిమా ప్రీ రిలీజ్ వేడుకకి ముఖ్య అతిథిగా హాజరైన శ్రీలీల మాట్లాడుతూ- ''స్లమ్ డాగ్ హజ్బెండ్ సినిమా సూపర్ హిట్ కావాలి'' అన్నారు. ''మా సినిమాలో వినోదం, భావోద్వేగాలు ఆకట్టుకుంటాయి'' అన్నారు ఏఆర్ శ్రీధర్. ''శ్రీలీల, వైష్ణవీ చైతన్య, ప్రణవి తెలుగు అమ్మాయిలే. నా కొత్త సినిమాకు తెలుగు అమ్మాయినే హీరోయిన్‌గా తీసుకుంటా'' అన్నారు డైరెక్టర్ బుచ్చిబాబు సానా. ''స్లమ్ డాగ్ హజ్బెండ్ హిట్ అయితే మరో పది మంది కొత్తవాళ్లకు అవకాశాలు ఇస్తాం'' అన్నారు అప్పిరెడ్డి, వెంకట్ అన్నపరెడ్డి.

తొలి అడుగు

ఇటు సౌత్.. అటు నార్త్.. కాస్త ఖాళీ దొరికితే డిజిటల్ వరల్డ్... ఇలా వరుస ప్రాజెక్ట్స్‌తో బిజీగా ఉంటున్నారు హీరోయిన్ అదితీరావ్ హైదరి. అయితే తొలిసారి ఈ బ్యూటీ ఓ ఉమెన్ సెంట్రిక్ ఫిల్మ్‌కు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారని కోలీవుడ్ సమాచారం. తమిళ దర్శక-నటుడు రాజేష్ ఎమ్. సెల్వ ఇటీవల కథానాయిక ప్రాధాన్యంగా సాగే ఓ కథ తయారు చేశారని, ఈ కథ విని, ఇందులోని పాత్ర నచ్చడంతో అదితీరావ్ హైదరి పచ్చ జెండా ఊపారని కోలీవుడ్ టాక్. ఈ సినిమా షూటింగ్ వచ్చే నెలలో ఆరంభం కానుందట. లేడీ ఓరియంటెడ్ చిత్రాల పరంగా అదితీకి ఇది తొలి అడుగు. మరి.. ఈ తొలి అడుగుతో ఈ తరహా చిత్రాలు ఇంకెన్ని చేస్తారో చూడాలి. ఇక 'సమ్మోహనం, వి, అంతరిక్షం, మహాసముద్రం' వంటి చిత్రాలతో అదితీరావ్ హైదరి తెలుగు ప్రేక్షకులకు సుపరిచితురాలే.

రీల్స్

డబుల్ ఇస్మార్ట్‌లో..



• సంజయ్ దత్

తెలుగులో మరో సినిమాకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చే ఆలోచనలో ఉన్నారట బాలీవుడ్ నటుడు సంజయ్ దత్. ప్రభాస్ హీరోగా మారుతి దర్శకత్వంలో రూపొందుతున్న 'రాజా డీలక్స్' (ప్రచారంలో ఉన్న టైటిల్) చిత్రంలో సంజయ్ దత్ ఓ కీలక పాత్రలో నటిస్తున్నట్లుగా వార్తలు వస్తున్న సంగతి తెలిసిందే. తాజాగా రామ్ హీరోగా పూరి జగన్నాథ్ దర్శకత్వంలో రూపొందుతున్న 'డబుల్ ఇస్మార్ట్' చిత్రంలోని ఓ కీలక పాత్రకు సంజయ్ దత్‌ను సంప్రదించిందట చిత్ర యూనిట్. ఈ చిత్రంలో భాగం కావడానికి సంజయ్ దత్ సుముఖంగా ఉన్నారని టాక్.

కేరాఫ్ దెయ్యం...



• రవిబాబు

ఒకప్పుడు గ్రామాల్లో మాతంగులుగా జీవించిన వారిలో ఒక స్త్రీ జీవితం ఆధారంగా రూపొందిన చిత్రం 'భయం.. కేరాఫ్ దెయ్యం'. మాతంగిగా రమ్య, మాంత్రికుడిగా నటుడు-దర్శకుడు రవి బాబు, తాంత్రికుడిగా నటుడు సత్యప్రకాష్ ముఖ్య పాత్రలు చేశారు. సీవీఎస్ఎం వెంకట రవీందర్ నాథ్ దర్శకత్వంలో పెదారికట్ల చేనెబోయిన్న నరసమ్మ, వెంకటేశ్వర్లు నిర్మించారు. ''హారర్, థ్రిల్లర్ అంశాలు జోడించి ఈ చిత్రాన్ని రూపొందించాం. ఇటీవల జరిపిన రెండో షెడ్యూల్‌లో రవిబాబుపై సీన్స్ తీశాం. కన్నడ, తెలుగు భాషల్లో నిర్మించిన ఈ చిత్రం విడుదల తేదీని త్వరలో తెలియజేస్తాం'' అని దర్శక-నిర్మాతలు అన్నారు.

రోడ్స్ బ్లాకు...



• శివానీ, శ్రీ కమల్

'**ఆ**కు పాకు ఇస్తరాకు.. ఆల్ సైడ్స్ రోడ్స్ బ్లాకు..' అంటూ సాగే పాట 'జిలేబి' చిత్రంలోనిది. 'నువ్వు నాకు నచ్చావ్', 'మల్లీశ్వరి', 'మన్మథుడు' వంటి చిత్రాలను తెరకెక్కించిన దర్శకుడు కె. విజయ భాస్కర్ కొంత గ్యాప్ తర్వాత తెరకెక్కించిన చిత్రం ఇది. శ్రీ కమల్, శివానీ రాజశేఖర్ జంటగా గుంటూరు రామకృష్ణ నిర్మించిన ఈ చిత్రం త్వరలో విడుదల కానుంది. ఈ సందర్భంగా సినిమాలోని 'ఆకు పాకు..' పాట లిరికల్ వీడియోను రిలీజ్ చేశారు. సంగీత దర్శకుడు మణిశర్మ స్వరకల్పనలో రామజోగయ్య శాస్త్రి రాసిన ఈ పాటను రాహుల్ సిప్లిగంజ్ పాడారు.

ఓ ప్రేమకథ



• మోక్ష, వికాస్ వశిష్ట, కుషిత

వికాస్ వశిష్ట, మోక్ష, కుషిత కళ్లపు హీరో హీరోయిన్లుగా అంజిరామ్ దర్శకత్వం వహించిన చిత్రం 'నీతోనే నేను'. ఈ సినిమా టైటిల్, పోస్టర్‌ను చిత్ర నిర్మాత ఎమ్. సుధాకర్ రెడ్డి బర్త్ డే సందర్భంగా రిలీజ్ చేశారు. ''చదువుకునే టైమ్‌లోనే సినిమా తీయాలనే కల ఉండేది. మంచి టీమ్‌తో 'నీతోనే నేను' తీశాను'' అన్నారు ఎమ్. సుధాకర్ రెడ్డి. ''ఈ సినిమా కోసం టీమ్ ప్రాణం పెట్టి పని చేశారు'' అన్నారు అంజిరామ్. ''ప్రతి ఒక్కరికీ కనెక్ట్ అయ్యే చిత్రమిది'' అన్నారు వికాస్. ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ నవీన్, కెమెరామేన్ మురళీ మోహన్, మ్యూజిక్ డైరెక్టర్ కార్తీక్ బి. కడగండ్ల పాల్గొన్నారు.